సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
గురువారం । 20 । ఏప్రిల్ । 2023



'హద్దు' దాటినా చర్యల్లేవు!
జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గోదావరిపై రోడ్డు వేసి ఇతర జిల్లాకు ఇసుకను తరలిస్తున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. - 8లో▸



అభివృద్ధికి అడ్డుపడుతున్న బీజేపీ
రాష్ట్ర అభివృద్ధికి అడ్డుపడుతున్న బీజేపీని నమ్మొద్దని మంత్రి దయాకర్‌రావు అన్నారు. తొర్రూరులో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. - 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
$42^0/26^0$
జిల్లాలో ఉదయం ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. రాత్రి సమయంలో ఉక్కపోతగా ఉంటుంది.



న్యూస్‌రీల్

ముగ్గురు తహసీల్దార్ల బదిలీ

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో ముగ్గురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ భవేష్‌మిశ్రా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మహాముత్తారం మండల తహసీల్దార్ మాధవిని మహదేవపూర్‌కు, మహదేవపూర్ తహసీల్దార్ శంకర్‌ను ఆర్డీఓ కార్యాలయ ఏఓగా, ఆర్డీఓ కార్యాలయంలో ఏఓగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాస్ మహాముత్తారం తహసీల్దార్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అభ్యంతరాల స్వీకరణ

భూపాలపల్లి అర్బన్: మండల పరిధిలోని వేశాలపల్లి గ్రామ సమీపంలో కేటాయించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలో అనర్హులు ఉంటే రేపు సాయంత్రం 5గంటల వరకు ఫిర్యాదులను స్వీకరించనున్నట్లు ఇన్‌చార్జ్ మున్సిపాలిటీ కమిషనర్ అనిల్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనర్హులు ఉంటే వారి పూర్తి ఆధారాలతో మున్సిపాలిటీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేపట్టి అనర్హులను తొలగిస్తామని తెలిపారు.


పోరాట స్ఫూర్తిని కోల్పోతున్న కార్మిక సంఘాలు

భూపాలపల్లి అర్బన్: సింగరేణిలో జాతీయ కార్మిక సంఘాలు పోరాట స్ఫూర్తిని కోల్పోతున్నాయని తెలంగాణ సింగరేణి ఉద్యోగ సంఘం రాష్ట్ర కన్వీనర్ కామెర గట్టయ్య ఆరోపించారు. ఏరియాలోని యూనియన్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ కార్మిక సంఘాల వైఫల్యాల మూలంగా 11వ వేజ్‌బోర్డు అమలు ఆలస్యం అవుతుందన్నారు. 10వ వేజ్ బోర్డు కాలపరిమితి ముగిసి 22 నెలలు అవుతున్నా కార్మికులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. జాతీయ సంఘాల్లో ఐక్యత లేకపోవడం మూలంగానే చర్చలు వాయిదాలు పడుతున్నాయని మండిపడ్డారు. వారిని కార్మికులు గనులపై నిలదీయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు దాసరి జనార్దన్, శ్రీనివాస్, ప్రసాద్‌రెడ్డి, లింగయ్య, జయశంకర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

భూపాలపల్లి అర్బన్: రేపు జిల్లా కేంద్రంలో ఆదర్శ మోటార్స్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి శ్యామల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీమ్ లీడర్స్, సెల్స్ ఎగ్జిక్యూటివ్, టెలికాలర్, సర్వీస్ అడ్వైజర్, టెక్నీషన్, వాసింగ్‌స్టాఫ్, డ్రైవర్ల నియామకానికి నియామకాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి విద్యార్థులు గల గిన యువతియువకులు సర్టిఫికెట్లతో జిల్లా ఉపాధి కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు. వివరాలకు 7702457968, 9848711767 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆస్పత్రి సందర్శించిన క్వాలిటీ బృందం



చిట్యాల: మండల కేంద్రంలోని సివిల్ ఆస్పత్రిని క్వాలిటీ అసెస్సార్స్ బృందం డాక్టర్ విక్రమ్‌శర్మ (ఛత్తీస్‌గఢ్), డాక్టర్ షకీలా(తమిళనాడు)లు బుధవారం సందర్శించారు. నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండెట్(ఎన్‌క్యూఏఎస్), లక్ష్య పథకాల్లో భాగంగా ఈ బృందం ఆస్పత్రిలోని వివిధ భాగాలను పరిశీలించారు. ఇక్కడి వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఓపీ రిజిస్టర్లను, ఐపీ, ఓటీ లేబర్ రూమ్, ఫార్మసీ, జనరల్, ఎమర్జెన్సీ విభాగాల గదులను పరిశీలించారు. ఇక్కడి సేవలు చాలా బాగున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో వైద్య సేవలను మరింతగా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ జీడి తిరుపతి, అనస్థీయా డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ సంధ్య, క్వాలిటీ మేనేజర్ డాక్టర్ భానుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

కంటైనర్‌లో రైలు ఇంజన్



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం గుండా హర్యానా రాష్ట్రం నుంచి ఛత్తీస్‌గఢ్ వైపునకు ఓ కంటైనర్ రైలు ఇంజన్‌ను తీసుకెళ్లడం బుధవారం కనిపించింది. దీంతో రైలు ఇంజన్‌ను చూసేందుకు జనం ఎగబడ్డారు.


లేఖలతో అవిశ్వాసానికి దిగిన కౌన్సిలర్లు



ఇరకాటంలో గండ్ర

మున్సిపాలిటీలో చల్లారని అసమ్మతి సెగలు

- చైర్ పర్సన్, వైస్‌చైర్మన్ చేత రాజీనామా చేయించండి..
- లేదంటే మా రాజీనామాలు ఆమోదించండి
- తగ్గేదేలే అంటున్న 20 మంది కౌన్సిలర్లు
- గులాబీ పార్టీలో పెరుగుతున్న అసమ్మతి
- ఎన్నికల ఏడాదిలో ఎమ్మెల్యే గండ్రకు చిక్కులు



ఎన్నికల వేళ తలనొప్పి..

ఆరు నెలల్లో ఎన్నికలు ఉండగా ఈ సమయంలోనే సొంత పార్టీలో నెలకొన్న వివాదాలు ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి తలనొప్పిగా మారాయి. స్థానిక ఎమ్మెల్యేగా గండ్ర, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలిగా ఆయన సతీమణి గండ్ర జ్యోతి కొనసాగుతున్నారు. అయినా కూడా పార్టీలో అసమ్మతి నెలకొనడం, పట్టు కోల్పోవడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల వేళ బీఆర్ఎస్‌లో అసమ్మతివాదులు పెరుగుతుండటం 'గండ్ర'కు కొత్త చిక్కులు తెచ్చి పెడుతున్నాయి.

భూపాలపల్లి: మున్సిపాలిటీలో సెగలు తగ్గడం లేదు. చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌ల చేత రాజీనామా చేయించండి.. లేదంటే తమ రాజీనామాలను ఆమోదించండంటూ ఏకంగా 20 మంది కౌన్సిలర్లు తిరుగుబాట పట్టారు. ఎన్నికల ఏడాదిలో గులాబీ పార్టీలో పెరుగుతున్న అసమ్మతి స్థానిక ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి తలనొప్పిగా మారింది.

ఎమ్మెల్యేకు కౌన్సిలర్ల మొర..

భూపాలపల్లి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణిసిద్ధు, వైస్‌చైర్మన్ కొత్త హరిబాబులపై మంగళవారం బీఆర్ఎస్‌కు చెందిన 20 మంది కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రకటించిన విషయం తెలిసిందే. అవిశ్వాస పత్రాన్ని అదనపు కలెక్టర్ టీఎస్ దివాకరకు అందించిన అనంతరం సదరు కౌన్సిలర్లతో ఎమ్మెల్యే గండ్ర మాట్లాడినప్పటికీ గొడవ చల్లారలేదు. తిరిగి బుధవారం ఉదయం 20 మంది కౌన్సిలర్లు జిల్లా కేంద్రంలోని అటవీశాఖ ఎకో పార్కులో సమావేశం అయ్యారు. మధ్యాహ్నం 4 గంటలకు క్యాంపు కార్యాలయానికి వెళ్లి ఎమ్మెల్యే గండ్రను కలిసి తమ ఆవేదనను మరోసారి వెళ్లగక్కారు. చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌ల తీరుపై మూడు సార్లు తమకు ఫిర్యాదు చేశామని, అయినా వారిలో మార్పు రాలేదని తెలిపారు. అంతేకాక ఫిర్యాదు చేసిన వారిని వివిధ రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో కౌన్సిల్ సమావేశాలు నిర్వహించడం లేదని, పనులు ఉంటే మీటింగ్‌లు నిర్వహిస్తున్నారంటూ.. పలు విషయాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వారి వైఖరిలో మార్పు రానందునే తాము అవిశ్వాసం ప్రకటించాల్సి వచ్చిందని తెలిపారు. అయితే తాము సూచించిన వారికి డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయలేదనే కారణంతో అవిశ్వాసం ప్రకటించినట్లుగా చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్ చెప్పడంలో వాస్తవం లేదని చెప్పారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే గండ్ర.. రెండు, మూడు రోజుల్లో తగిన నిర్ణయం తీసుకుంటానని కౌన్సిలర్లకు చెప్పినట్లు సమాచారం.

వాళ్లుంటే మేం ఉండం..

చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌లుగా వెంకటరాణిసిద్ధు, హరిబాబు ఉంటే తాము పార్టీలో ఉండేది లేదని అవిశ్వాసానికి దిగిన కౌన్సిలర్లు ఎమ్మెల్యే గండ్ర ముందు వెల్లడించారు. వారితో రాజీనామా చేయించి మీకు నచ్చిన వారిని నియమించండి.. లేదంటే మా రాజీనామాలు ఆమోదించండి అంటూ 20 మంది కౌన్సిలర్లు ఒకరి వెనుక ఒకరు రాజీనామా పత్రాలను అందజేశారు. అయితే ఎమ్మెల్యే ఆ పత్రాలను తీసుకోకుండానే జిల్లా కేంద్రంలో జరుగుతున్న ఇఫ్తార్ విందుకు వెళ్లిపోయారు. దీంతో కౌన్సిలర్లు చేసేది లేక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో తమ లేఖలను మీడియా ముందు చూపించారు.

ఏం జరుగబోతుంది..?

చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌లు ఆ పదవుల్లో ఉంటే తాము ఉండబోమని కౌన్సిలర్లు ముక్తకంఠంతో చెప్పేశారు. అవసరమైతే పార్టీని వీడుతామని నేరుగానే అల్టిమేటం జారీ చేశారు. దీంతో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆ ఇద్దరితో రాజీనామా చేయిస్తారా.. లేక కౌన్సిలర్లతో మరోమారు చర్చించి గొడవ సద్దుమణిగిస్తారా అనేది తేలాల్సి ఉంది. ఏది ఏమైనప్పటికీ ఎవరు పదవుల్లో ఉంటారు. ఎవరు వీడుతారు.. ఎవరు తగ్గుతారనేది పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉండగా మున్సిపాలిటీలో నెలకొన్న ఈ వివాదాలు ప్రతిపక్ష పార్టీలకు అస్త్రాలుగా మారాయి.

దసరా నాటికి వరంగల్ హెల్త్ సిటీ!



నిర్మాణంలో వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి





మల్టీ సూపర్‌స్పెషాలిటీ నిర్మాణంపై మంత్రి హరీశ్ సమీక్ష, కేటీఆర్ చేసిన ట్వీట్

- పనుల వేగం మరింత పెంచి పూర్తి చేసేలా చర్యలు
- హైదరాబాద్‌లో మంత్రి హరీశ్‌రావు ఉన్నతస్థాయి సమీక్ష
- వరంగల్ మల్టీ స్పెషాలిటీ పూర్తయితే మెడికల్ హబ్
- తెలంగాణలో అతిపెద్ద ప్రభుత్వ ఆస్పత్రి : ట్విట్టర్‌లో మంత్రి కేటీఆర్

సాక్షిప్రతినిధి, వరంగల్: రాష్ట్రానికి తలమానికం కానున్న వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులు దసరా నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. పనుల పురోగతిపై రోజువారీగా సమీక్ష నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌డీలో వరంగల్ హెల్త్ సిటీ మెడికల్ కాలేజీల పనులు పురోగతి, ఇతర అంశాలపై బుధవారం మంత్రి హరీశ్‌రావు ఆర్‌అండ్‌బీ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించే దిశగా సీఎం కేసీఆర్ రాష్ట్రంలో విప్లవాత్మకమైన చర్యలు తీసుకుంటున్నారన్న మంత్రి హరీశ్.. దసరా నాటికి వరంగల్ మల్టీ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. వరంగల్ హెల్త్ సిటీ నిర్మాణ పనుల వేగం పెంచాలని సూచించారు. దసరా నాటికి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇందులో భాగంగా ఒక వైపు వైద్యం, మరోవైపు వైద్య విద్యను విస్తృతం చేస్తున్నట్లు చెప్పారు. వరంగల్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి పూర్తయితే మెడికల్ హబ్‌గా మారుతుందన్నారు. ఇందులో అత్యాధునిక వైద్య పరికరాలు సమకూరుస్తున్నట్లు చెప్పారు. అత్యాధునిక మాడ్యులర్ థియేటర్లు, ఇన్ఫెక్షన్ వ్యాప్తి చెందే అవకాశమే లేకుండా ఎయిర్ హ్యాండ్లింగ్ యూనిట్స్ కూడా ఏర్పాటు చేయాలన్నారు. వరంగల్ హెల్త్ సిటీ నిర్మాణాలకు సంబంధించి వైద్య ఆరోగ్య శాఖ తరఫున అవసరమైన అన్ని చర్యలు పూర్తి చేశామని, ఆర్‌అండ్‌బీ అధికారులు పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.

తెలంగాణలో అతిపెద్ద ప్రభుత్వ ఆస్పత్రి : మంత్రి కేటీఆర్ ట్వీట్

వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం కోసం మంత్రి హరీశ్‌రావు హైదరాబాద్‌లో సమీక్ష సమావేశం నిర్వహించగా.. రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ వరంగల్ ఆస్పత్రి నిర్మాణం, ఆరోగ్య తెలంగాణ విషయంలో సీఎం కేసీఆర్‌కు ట్విట్టర్‌లో ధన్యవాదాలు తెలపారు. 'వరంగల్ నగరంలో 2000 పడకలతో తెలంగాణలోనే అతిపెద్ద ప్రభుత్వ ఆస్పత్రి శరవేగంగా రాబోతుంది.. 33 జిల్లాల్లో ఒక మెడికల్ కాలేజీ , నర్సింగ్ కాలేజీ ఉండడం వల్ల ఇది ఆరోగ్య సంరక్షణ వికేంద్రీకరణలో ఒక పెద్ద ముందడుగు అవుతుంది.. ఆరోగ్య తెలంగాణ విషయంలో సీఎం కేసీఆర్ గారికి ధన్యవాదాలు'' అంటూ ట్వీట్ చేశారు.

'కంటివెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



కంటివెలుగు శిబిరంలో ఎమ్మెల్యే

టేకుమట్ల(రేగొండ): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కోరారు. రేగొండ మండల పరిధిలోని తిరుమలగిరిలో రెండో విడత కంటివెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. 18 సంవత్సరాల నుంచి వృద్ధాప్యం వరకు ఉన్న వ్యక్తులు ఈ కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరం వద్ద ఉచితంగా పరీక్షలు చేసి అద్దాలు ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కట్ల రాణి, ఎంపీటీసీ ప్రతాప్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల కో–ఆర్డినేటర్ మటిక సంతోష్, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

కూలీలు కొలతల ప్రకారం పనిచేయాలి



కూలీలకు అవగాహన కల్పిస్తున్న పురుషోత్తం

చిట్యాల: ఉపాధిహామీ పనులు చేసే కూలీలు కొలతల ప్రకారం మట్టి పని చేయాలని డీఆర్‌డీఓ పురుషోత్తం సూచించారు. మండల పరిధిలోని ఒడితల గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన బుధవారం సందర్శించి కూలీలకు పని దినాలతో పాటు కొలతలపై అవగాహన కల్పించారు. గతంలో కూలీలకు రూ.257 ఉండేదని ఇప్పుడు రూ.272 పెంచినట్లు తెలిపారు. కొలతల ప్రకారం పని చేస్తేనే ఎక్కువ మొత్తంలో డబ్బులు వస్తాయన్నారు. అనంతరం గ్రామంలోని బృహత్, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామయ్య, స్థానిక సర్పంచ్ ఎర్రబెల్లి సాంబలక్ష్మి భద్రయ్య, ఏపీఓ హాలీం పాషా, పంచాయతీ కార్యదర్శి వినోద్, ఈసీ రంజిత్ కుమార్, టీఏ అపర్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ రాజు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

డబ్బులు ఇవ్వడంలేదని రోడ్డెక్కిన రైతులు



రైతులకు నచ్చచెబుతున్న ఎస్సై లక్ష్మణ్‌రావు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం మద్దులపల్లి శివారులోని బల్లాపూర్ పరిధి కుంట్లం–2 ఇసుక క్వారీకి పంట భూములు లీజుకు ఇచ్చిన రైతులకు కాంట్రాక్టర్లు డబ్బులు చెల్లించడం లేదని మళ్లీ బుధవారం రోడ్డుపై బైఠాయించారు. దీంతో రెండు గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. రాకపోకలు నిలిచిపోవడంతో మద్దులపల్లి, పలుగుల, కుంట్లం గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఎకరానికి రూ.55వేలు చెల్లిస్తామని కాంట్రాక్టర్లు చెప్పి తప్పించుకుని తిరుగుతున్నారని తెలిపారు. సుమారు 60 ఎకరాల్లో 20మంది రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూముల్లో ఇసుక నింపి ఇతర ప్రాంతాలకు క్వారీని బదిలీ చేయించుకుంటున్నారన్నారు. తమకు న్యాయం చేయకపోతే ధర్నాను కొనసాగిస్తామన్నారు. ఎస్సై లక్ష్మణ్‌రావు చేరుకొని రోడ్డుపై బైఠాయించిన రైతులకు నచ్చచెప్పి ధర్నాను విరమింపజేశారు. దీంతో ట్రాఫిక్ క్లియర్ అయ్యింది.

కాళేశ్వరంలో పనుల పరిశీలన



జెడ్పీసీఈఓను సన్మానిస్తున్న అర్చకుడు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో జెడ్పీ సీఈఓ విజయలక్ష్మీ పలు పనులను పరిశీలించారు. బుధవారం ఆమె ముందుగా కాళేశ్వరముక్తీశ్వరస్వామి వార్లను దర్శించుకోగా ఆలయ అర్చకుడు వెల్ది శరత్‌చంద్ర ప్రసాదాలు అందజేసి సన్మానించారు. తరువాత కాళేశ్వరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా పనులను పరిశీలించిన ఆమె త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట ఎంపీడీఓ రవీంద్రనాథ్, ఎంపీఓ ప్రసాద్, ఏపీఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నియామకాలపై విచారణ జరిపించాలి



ధర్నా చేస్తున్న నర్సులు

భూపాలపల్లి అర్బన్: జిల్లా వైద్యారోగ్యశాఖ పరిధిలోని ఎన్‌హెచ్ఎం విభాగంలో చేపడుతున్న నియామకాల్లో అక్రమాలు జరుగుతున్నాయని వాటిపై కలెక్టర్ స్పందించి విచారణ జరిపించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పసుల వినయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్ఎం స్టాఫ్‌నర్సు నియామకాల్లో జిల్లా ప్రధాన ఆస్పత్రిలో డీఎంఎఫ్‌టీ కింద పని చేస్తున్న స్టాఫ్ నర్సులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్‌కుమార్ మాట్లాడారు. అభ్యర్థులకు ఎటువంటి సమాచారం లేకుండానే మెరిట్‌లిస్టును నోటీసు బోర్డులో పెట్టకుండా ఏ ప్రాతిపదికన నియామకాలు చేపడుతున్నారని ప్రశ్నించారు. జిల్లా ఆస్పత్రిలో పని చేస్తున్న వారికి అవకాశం కల్పించాలని కలెక్టర్ ఆదేశించినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. స్టాఫ్‌నర్సు నియామకాలను నిలిపివేసి అర్హులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాధితులు సవిత, సరిత, అరుణ, స్వప్న, వనిత, శైలజలు పాల్గొన్నారు.

పేదల గుడిసెల కూల్చివేత



గుడిసెలు తొలగిస్తున్న అధికారులు

మహదేవపూర్: పేదల గుడిసెలను అటవీశాఖ అధికారులు జేసీబీతో కూల్చివేయించారు. ఈ ఘటన బుధవారం మండల పరిధిలోని కుదురుపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గత ఏడాది వచ్చిన గోదావరి వరదల కారణంగా జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో గుడిసెలు వేసుకుని గ్రామస్తులు నివాసం ఉంటున్నారు. అయితే ఈ స్థలం అటవీశాఖకు చెందిందని అటవీ శాఖ క్షేత్రాధికారిణి కమల తెలిపడంతో పాటు వెంటనే గుడిసెలు ఖాళీ చేయాలని సూచించారని గ్రామస్తులు తెలిపారు. మాది ముంపు ప్రాంతమని ఎప్పటి నుంచో గుడిసెలు వేసుకొని ఉంటున్నామని, ఇప్పటికిప్పుడు ఖాళీ చేయమంటే ఎలా అంటూ బాధితులు ప్రశ్నించారు. దీంతో ఎస్సైలు రాజ్‌కుమార్, భవాని ఆధ్వర్యంలో జేసీబీతో పేదలు వేసుకున్న గుడిసెలను కూల్చివేయించారు. దీనిపై ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ బెల్లంపల్లి సురేష్ మండిపడ్డారు. పేదల గుడిసెలను అక్రమంగా కూల్చారని, పేదలకు ఇళ్ల స్థలాలను ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అవినీతిపై విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న కీర్తిరెడ్డి

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మున్సిపాలిటీలో అవినీతి జరుగుతుందని బహిరంగంగానే కౌన్సిలర్లు చైర్మన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాస తీర్మానానికి పట్టుబడుతున్నారని ఉన్నతాధికారులు వెంటనే విచారణ చేపట్టి అవినీతిని బయట పెట్టాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశానికి కీర్తిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైందన్నారు. ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అనుచరవర్గమైన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు చేసిన అవినీతి పనులకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం చేయడం జరిగిందన్నారు. అంతేకాకుండా డబుల్ బెడ్ రూంల విషయంలో, పండుగ ఉత్సవాల్లో బ్లీచింగ్ పౌడర్, సిబ్బంది జీతాలు, సిబ్బంది సామగ్రిలో అన్నింటిలోనూ అవినీతి పాల్పడడం దారుణమన్నారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు అర్హులకు ఇళ్లు ఇవ్వకుండా వారి అనుచరులకు కేటాయించడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కన్నం యుగేందర్, అర్బన్ అధ్యక్షులు సామల మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాజీ జిల్లా అధ్యక్షులు వెన్నంపల్లి పాపన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎరుకల గణపతి, జిల్లా నాయకులు రాంరెడ్డి, కోరే సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

మహదేవపూర్: జీసీసీ సిబ్బంది సమయపాలన పాటించాలని టీఎస్‌డీఎం జీసీసీ ఈఎస్‌టీ ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మహదేవ్‌పూర్ ఫీల్డ్ సిబ్బందితో సేల్స్ రివ్యూ మీటింగ్ నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. డిపోల సమయపాలన, మొబైల్ యాప్‌ని ఉపయోగించడం, అమ్మకాలు, గత సంవత్సరం చేసిన కొనుగోళ్లు, అమ్మకాల వివరాలు, 2023–24 కోసం కార్యాచరణ హాస్టళ్లకు సరుకుల సరఫరా వంటి తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ హరిలాల్, గోడౌన్ ఇంచార్జిలు, సేల్స్ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి సాధనకు పోరాటం తప్పదు



మాట్లాడుతున్న చందా లింగయ్యదొర

కాటారం: గోదావరి పరీవాహక ప్రాంతంలో నిర్మించిన ప్రాజెక్టుల ద్వారా ఈ ప్రాంతాలకు సాగు నీరు అందించేంత వరకూ పోరాటం తప్పదని గిరిజన ఐక్యవేదిక జాతీయ కన్వీనర్, భద్రాచలం మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ప్రజాసంఘాల నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. కోట్లాది రూపాయలతో మంథని ప్రాంతంలో నిర్మించిన ప్రాజెక్టుల ద్వారా దక్షిణ తెలంగాణ, రాయలసీమ ప్రాంతాలకు నీరు తరలిపోతుందే తప్పా ఈ ప్రాంతంలోని ఒక ఎకరాకు కూడా సాగు నీరు పారడం లేదని ఆరోపించారు. ఈ ప్రాంతంలోని బీడు భూములకు సాగునీరు అందించాలనే సంకల్పం ఈ ప్రాంత రాజకీయ నాయకులకు లేకపోవడం దురదృష్టకరమన్నారు. రాజకీయ నాయకులు ప్రజలను కేవలం ఓటర్లుగానే చూస్తున్నారని విమర్శించారు. సాగునీటి సాధనకు గోదావరి పరీవాహక ప్రాంతంలోని ప్రజాసంఘాల నాయకుల ఆధ్వర్యంలో త్వరలో అదిలాబాద్‌టు ఖమ్మం వరకు పాదయాత్ర చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రాంతాలకు సాగునీరు అందించేంత వరకూ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. అనంతరం స్థానిక ఎంపీపీ పంతకాని సమ్మయ్య, కాంగ్రెస్ నాయకులు లింగయ్యదొరను కలిసి తమ మద్దతు తెలిపారు. ఈ సమావేశంలో మాలభేరి రాష్ట్ర కన్వీనర్ పీక కిరణ్, మాజీ ఎంపీపీ గురుసింగ బాపు, ప్రజా సంఘాల నాయకులు దుర్గం శంకర్, దయ్యం పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్ల చికిత్స పేరిట బురిడీ

- నకిలీ వెబ్‌సైట్ మోసపూరిత ప్రకటన
- రూ.94,900 పోగొట్టుకున్న విశ్రాంత ఉపాధ్యాయుడు

గార్ల: మోకాళ్ల నొప్పుల చికిత్స కోసం నకిలీ వెబ్ సైట్ ద్వారా గార్ల మండలం రాంపురం గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ బోళ్ల వెంకట్‌రెడ్డి రూ.94,900 పోగొట్టుకున్నాడు. మోకాళ్ల నొప్పుల చికిత్స కోసం పతంజలి యోగ్ పీఠ్ వెబ్‌సైట్ చూశాడు. ఇందులో ఉన్న టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి చికిత్స వివరాలు తెలుసుకున్నాడు. తొలుత రూ.21,000 నగదు చెల్లించాలని వెబ్‌సైట్ నిర్వాహకులు చెప్పారు. అనంతరం బ్యాంకు అకౌంట్ నంబర్ ఇవ్వడంతో.. వెంకట్‌రెడ్డి మొదట అకౌంట్‌కు రూ.21,000 పంపించాడు. ఇంకా నగదు పంపించాలని అవతలి వ్యక్తి కోరడంతో వెంకట్‌రెడ్డి నాలుగు దఫాలుగా రూ.94,900 పంపించాడు. నగదు మొత్తం పంపించిన తర్వాత వెబ్‌సైట్ నిర్వాహకులు ఫోన్ లేపకపోవడంతో తాను మోసపోయానని గ్రహించి సైబర్ క్రైం టోల్‌ఫ్రీ నంబర్ 1903కు ఫోన్ చేశాడు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై బానోత్ వెంకన్న కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భద్రకాళి బ్రహ్మోత్సవాలకు రండి

- ఎంపీ జోగినపల్లికి ఆహ్వానం



జోగినపల్లికి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఈఓ శేషభారతి

హన్మకొండ కల్చరల్ : ఈ నెల 22 నుంచి జరగనున్న భద్రకాళి భద్రేశ్వరుల కల్యాణబ్రహ్మోత్సవాలకు రావాలని బుధవారం హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్‌ను ఈఓ శేషభారతి, పర్యవేక్షకులు అద్దంకి విజయ్‌కుమార్, సిబ్బంది ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఉన్నారు.

21న ఆన్‌లైన్ తరగతుల యాప్‌పై అవగాహన

హన్మకొండ: ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచిత ఆన్‌లైన్ తరగతుల యాప్‌పై ఈ నెల 21న ఉదయం 9 గంటలకు హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేష్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాప్‌ను చక్రవర్తి ఈ - క్లాస్‌రూం వారితో రూపొందించినట్లు తెలిపారు. ఇందులో 57 రకాల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ పోటీ పరీక్షలతోపాటు, వివిధ రాష్ట్రస్థాయి పోటీ పరీక్షల వీడియో తరగతులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పోటీ పరీక్షలకు సంబంధించి ఇంగ్లిష్ మీడియంలో, రాష్ట్ర ప్రభుత్వ పోటీ పరీక్షల వీడియోలు తెలుగులో ఉంటాయని వివరించారు. ఈసౌకర్యాన్ని నిరుద్యోగులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యాప్‌లో ఉచిత శిక్షణ నమోదు కోసం 86880 98700 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.



‘హద్దు’ దాటినా చర్యల్లేవు!

- రాత్రి లోడింగ్.. పగలు బంద్
- అలసత్వం ప్రదర్శిస్తున్న అధికారులు
- అడ్డుకున్న తహసీల్దార్ బదిలీ

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గోదావరిపై అక్రమంగా రోడ్డు వేసి మంచిర్యాల జిల్లా కొల్లూరుకు హద్దులు దాటి ఇసుకను తరలిస్తున్నా.. సంబంధిత అధికారులు మౌనం పాటిస్తున్నారు. మంగళవారం రాత్రికి రాత్రే పొక్లెయిన్‌లతో మద్దులపల్లి సమీపంలోని బల్లాపూర్ వద్ద టిప్పర్లతో గోదావరిలో ఇసుకను కొల్లూరుకు తరలించి ఇసుకాసురులు సొమ్ము చేసుకున్నారు. అనుమతులు ఉన్నాయని చెబుతున్న కాంట్రాక్టర్లు.. పగలు ఇసుక లోడింగ్ నిలిపి రాత్రి వేళల్లో ఎందుకు రహస్యంగా లోడింగ్ చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాగా.. ఈఅక్రమ దందాపై సంబంధిత టీఎస్ఎండీసీ, మైనింగ్, రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసుశాఖలు అలసత్వం ప్రదర్శిస్తుండడం విమర్శలకు దారి తీస్తోంది. అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలం కావడంతో అధికారులపైన కాంట్రాక్టర్లదే పై చేయి అన్నట్లు కనిపిస్తోంది. అక్రమ దందాను అడ్డుకుందామని వెళ్లిన తహసీల్దార్ శంకర్‌ను సదరు కాంట్రాక్టర్లు బెదిరించి పంపడం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. బుధవారం మధ్యాహ్నం తహసీల్దార్‌ను బదిలీ చేస్తూ కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు రావడంతో.. ఇది ఇసుకాసురుల పనేనని చర్చ జరిగింది. కానీ.. అసలు విషయం బయటికి రాలేదు. ఈ దందాకు అధికారులే సహకరిస్తుండడంతో ప్రభుత్వ ఖజానాకు గండి పడనుందని విమర్శలు ఉత్పన్నమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇసుక లోడింగ్‌పై చర్యలు తీసుకోవాలని మద్దులపల్లి, పలుగుల, కుంట్లం గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈవిషయమై టీఎస్ఎండీసీ పీఓ తారక్‌నాథ్‌రెడ్డిని ఫోన్ ద్వారా ప్రయత్నించినా.. అందుబాటులోకి రాలేదు. తహసీల్దార్ శంకర్‌ను ఫోన్ ద్వారా సంప్రదించగా.. ‘అక్రమంగా మట్టి రోడ్డు వేశారు. గోదావరిలో మట్టి రోడ్డుపైన అనుమతులు ఇవ్వమనగా బకెట్ వేసి చంపుతామని బెదిరించారు. ఆతర్వాత క్షమించండి. అని చెప్పారు’ అని తహసీల్దార్ బదులిచ్చారు. బదిలీ విషయం అడగ్గా.. బదిలీకి ఇసుక రవాణాకు సంబంధం లేదని, మామూలుగానే బదిలీ జరిగిందని ఆయన పేర్కొన్నారు.



గోదావరిలో రాత్రి లోడింగ్ చేస్తున్న పొక్లెయిన్

ఇసుక మాఫియా ఇన్‌ఫ్లూయెన్స్‌తోనేనా?



మహదేవపూర్: ఇసుక మాఫియా ఇన్‌ఫ్లూయెన్స్‌తోనే తహసీల్దార్ శంకర్ జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయానికి బదిలీ అయ్యారనే విమర్శలు మండలంలో వెల్లువెత్తున్నాయి. గోదావరి నుంచి ఇసుక తరలింపు చేట్టేందుకు కాంట్రాక్టర్ నేరుగా నదిలో రోడ్డు నిర్మిస్తుండగా.. తహసీల్దార్ అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఆ మరుసటి రోజే తహసీల్దార్ బదిలీ అవ్వడం పలు అనుమానాలకు తావిస్తోంది.

అభివృద్ధికి అడ్డుపడుతున్న బీజేపీ



మంత్రి ఎర్రబెల్లి దంపతులను గజమాలతో సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు

- బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు రూరల్: తెలంగాణ అభివృద్ధికి నిరంతరం అడ్డుపడుతున్న బీజేపీని నమ్మొద్దని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని రామ ఉపేందర్ గార్డెన్‌లో వెలికట్ట, నాంచారీమదూరు గ్రామాలు, బోజ్యా, టీక్యా, పెద్దమంగ్యా తండాల ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎర్రబెల్లి ట్రస్ట్ చైర్మన్ ఉషా దయాకర్‌రావు పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ నుంచి ఇప్పటికే రూ.2.50 లక్షల కోట్లు పన్నుల రూపంలో కేంద్రానికి చెల్లిస్తే, తిరిగి కేవలం రూ.1.50 లక్షల కోట్ల నిధులు మాత్రమే ఇచ్చారని, మిగిలిన రూ.1 లక్ష కోట్ల నిధులను బీజేపీ పాలిస్తున్న రాష్ట్రాలకు కేటాయిస్తూ అన్యాయం చేస్తున్నారన్నారు. కేంద్రంపై పోరాటం చేస్తున్న సీఎం కేసీఆర్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మంత్రి ఎర్రబెల్లి దంపతులను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సీతారాములు, ఎంపీపీ అంజయ్య, జెడ్పీటీసీ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ హరిప్రసాద్‌రావు, ఈజీఎస్ స్టేట్ డైరెక్టర్ వెంకటనారాయణగౌడ్, రైతు మండల కో-ఆర్డినేటర్ దేవేందర్‌రెడ్డి, పార్టీ మండల కార్యదర్శి ప్రమోద్, వైస్ ఎంపీపీ శ్యాంసుందర్‌రెడ్డి, సర్పంచ్‌లు పుష్పలీల, యాదలక్ష్మి, కాలునాయక్, శోభన, శారద, ఎంపీటీసీలు సుకన్యరెడ్డి, మల్లమ్మ, పార్టీ గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాపను దత్తత ఇచ్చిన నలుగురిపై కేసు

గార్ల: ప్రభుత్వ అనుమతి లేకుండా పాపను అక్రమంగా దత్తత ఇచ్చిన, తీసుకున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బానోత్ వెంకన్న బుధవారం తెలిపారు. గార్ల మండలం సత్యనారాయణపురం పంచాయతీ ఇందిరానగర్ గ్రామానికి చెందిన మాలోత్ వెంకటేశ్ ఉమకు తొలుత ఇద్దరు ఆడపిల్లలు జన్మించారు. మూడో కాన్పులో సైతం మళ్లీ ఆడపిల్లే పుట్టడంతో సాకలేక, వారికి తెలిసిన బయ్యారం మండలం జగ్గుతండాకు చెందిన కొమ్రాజుల నాగరాజు స్వప్న దంపతులకు పాపను దత్తతగా ఇచ్చారు. విషయం తెలుసుకున్న జిల్లా చైల్డ్ లైన్, ఐసీడీఎస్ అధికారులు కొద్ది రోజుల క్రితం ఇందిరానగర్‌కు చేరుకొని వెంకటేశ్–ఉమను ప్రభుత్వ అనుమతి లేకుండా దత్తత ఇస్తే, దత్తత ఇచ్చిన, తీసుకున్న జంటలపై కేసులు అవుతాయని పేర్కొన్నారు. వెంకటేశ్ బయ్యారం వెళ్లి పాపను ఇంటికి తెచ్చుకున్నాడు. కొద్దిరోజుల తర్వాత ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారద పాప బాగోగులు చూసేందుకు వెంకటేశ్ ఇంటికి వెళ్లగా.. పాప కనిపించలేదు. పాప ఎక్కడ ఉందని వెంకటేశ్‌ను అడిగితే సరైన సమాధానం చెప్పలేదు. దీంతో గ్రామంలో పలువురిని విచారించగా.. మళ్లీ పాపను నాగరాజు, స్వప్న దంపతులకు ఇచ్చినట్లు తెలిసింది. సూపర్‌వైజర్ శారద స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇరువురు జంటలపై ఫిర్యాదు చేసింది. ఈమేరకు ఎస్సై నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎనర్జీ ఆడిట్ చేపట్టాలి

హన్మకొండ: పట్టణాలు, మండల కేంద్రాల్లో ఎనర్జీ ఆడిట్ చేపట్టాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు సూచించారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ఎంఆర్టీ విభాగం డివిజన్ ఇంజనీర్ల సమీక్ష సమావేశం జరిగింది. గోపాల్‌రావు మాట్లాడుతూ.. రెవెన్యూ తీసుకురావడంలో మీటరింగ్, బిల్లింగ్‌ల ఎంఆర్టీ విభాగం ప్రముఖ పాత్ర పోషిస్తోందన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల్లో నాణ్యత ఉండేలా చూడాలని, ప్రతీ పని నాణ్యతగా జరగాలని, కంపెనీ అభివృద్ధిలో ఎంఆర్టీ విభాగం పాలుపంచుకోవాలన్నారు. సమావేశంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వర్‌రావు, పి.సంధ్యారాణి, పి.మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

విస్తృత సేవలతో ఆర్థికాభివృద్ధి సాధించాలి



సమీక్షలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు

- వరంగల్ డీసీసీబీ చైర్మన్ రవీందర్‌రావు

హన్మకొండ: నాబార్డు అందిస్తున్న ఆర్థిక సహాయంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు వ్యాపార సేవలు విస్తరించి ఆర్థికాభివృద్ధి సాధించాలని వరంగల్ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అన్నారు. బుధవారం డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో ప్రాథమిక సహకార సంఘాల బలోపేతానికి నాబార్డు అందించిన ఆర్థిక సహాయంతో చేపట్టిన వ్యాపార విస్తరణ కార్యక్రమాలపై సమీక్ష సమావేశం జరిగింది. ఇందులో నాబార్డు డీడీఎం చంద్రశేఖర్, బ్యాంక్ సీనియర్ అధికారులతో కలిసి మార్నేని రవీందర్‌రావు సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. వరంగల్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలోని 50 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల బలోపేతానికి నాబార్డు ద్వారా మూడు విడతలుగా అందించిన రూ.54.53 కోట్ల రుణ వితరణతో మొత్తం 129 ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. ఇంకా 20 సహకార సంఘాల బలోపేతానికి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను రవీందర్‌రావు ఆదేశించారు. సమావేశంలో బ్యాంకు సీఈఓ చిన్నారావు, జనరల్ మేనేజర్ శ్రీధర్, అధికారులు పాల్గొన్నారు.

పౌల్ట్రీ ఫెడరేషన్ రీజినల్ నూతన కమిటీ ఎన్నిక



పౌల్ట్రీ ఫెడరేషన్ రీజినల్ నూతన కమిటీ ఇదే..

కాజీపేట అర్బన్: హనుమకొండ హంటర్ రోడ్డులోని బీవీ.రావు భవన్‌లో బుధవారం తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ వరంగల్ రీజియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కోళ్ల రైతులు పాల్గొని రీజినల్ నూతన కమిటీ అధ్యక్షుడిగా వేనెపెల్లి రామారావు, కార్యదర్శిగా సీహెచ్.దేవేందర్‌రెడ్డి, కోశాధికారిగా నెమిరిగొమ్ముల వేణురావు, సభ్యులుగా గులాం సంధాని, గాదె రాజేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉమ్మడి వరంగల్ పౌల్ట్రీ ఫార్మర్స్, హైదరాబాద్ పౌల్ట్రీ ఫార్మర్స్ నూతన కమిటీని అభినందించి పుష్పగుచ్ఛాలు అందించారు. కార్యక్రమంలో టీపీఎఫ్ రాష్ట్ర నాయకులు కాసర్ల మోహన్‌రెడ్డి, భాస్కర్‌రావు, హరిబాబు, సుబ్రహ్మణ్యం, శ్యాంసుందర్‌రావు, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కాంతుల్లో డీజిల్ లోకో షెడ్

- నేడు గోల్డెన్ జూబ్లీ వేడుకలు
- రైల్వే జీఎం చేత పలు ప్రారంభోత్సవాలు

కాజీపేట రూరల్: కాజీపేట డీజిల్ లోకో షెడ్ విద్యుత్ కాంతులతో మెరిసిపోతోంది. గురువారం జరిగే డీజిల్ లోకో షెడ్ గోల్డెన్ జూబ్లీ వేడుకలను పురస్కరించుకుని రైల్వే అధికారులు షెడ్ ప్రాంగణమంతా విద్యుత్ దీపాలతో అలంకరించారు. రైల్వే అధికారులు ఉత్సవాలకు సంబంధించి బిజీబిజీగా ఉన్నారు. గోల్డెన్ జూబ్లీ వేడుకలకు సంబంధించి అన్ని విభాగాలు, కార్యాలయాలు సుందరంగా అలంకరించి సర్వం సిద్ధం చేశారు.

నేడు రైల్వే జీఎం రాక

గోల్డెన్ జూబ్లీ వేడుకలకు రైల్వే జీఎం ఎకె.జైన్ ముఖ్య అతిథిగా రానున్నారు. సికింద్రాబాద్ నుంచి రైల్వే జీఎం ప్రత్యేక రైళ్లో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు కాజీపేట జంక్షన్‌కు చేరుకుంటారు. షెడ్‌లో జీఎం పాల్గొని ప్రారంభించేవి, బ్యాలెన్సింగ్ మిషన్, షెడ్ విస్తరణ టీఎంఅండ్ యూటీ పనులను ప్రారంభిస్తారు. టెక్నికల్ స్టాల్‌ను సందర్శిస్తారు. డీఎం ప్లాంట్, సింటెడ్ బ్రాంజ్ ఫిల్టర్ క్లీనింగ్ మిషన్, బ్యాటరీ షెడ్, టెక్నికల్ సెమినార్ మీటింగ్, ప్రదర్శన సందర్శన, స్కాట్ అండ్ గైడ్స్ స్వాగతం, సావనీర్ ఆవిష్కరణ, డీజిల్‌షెడ్ సాధించిన అభివృద్ధిపై వీడియో, జీఎం చేత అవార్డుల ప్రదానం ఇతర కార్యక్రమాల్లో పాల్గొని రాత్రి 8 గంటలకు డిన్నర్ తర్వాత జీఎం 8:15 గంటలకు ప్రత్యేక రైళ్లో జీఎం సికింద్రాబాద్‌కు తిరుగు ప్రయాణం అవుతారు.



కాంతులీనుతున్న డీజిల్ లోకో షెడ్

21నుంచి కోమటిపల్లి రైల్వే గేట్ మూసివేత

కాజీపేట సబ్‌డివిజన్ పరిధి కోమటిపల్లి రైల్వే గేట్‌ను ఈనెల 21 నుంచి 27వ తేదీ వరకు మూసివేయనున్నట్లు బుధవారం కాజీపేట రైల్వే అధికారులు తెలిపారు. రైల్వే ట్రాక్ మరమ్మతు కారణంగా కోమటిపల్లి రైల్వే గేట్ నంబర్ 2ను మూసిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు ప్రజలు, వాహనదారులు సహకరించి రైల్వేశాఖకు తోడ్పడాలని వారు కోరారు.

పరీక్ష రాసి వస్తూ పరలోకాలకు..

- వెనుక నుంచి లారీ ఢీకొని యువకుడి దుర్మరణం
- మరొకరికి గాయాలు



ప్రణయ్(ఫైల్)

ఎల్కతుర్తి: పరీక్ష రాసి వస్తుండగా.. ఓ లారీ విద్యార్థి ప్రాణాన్ని బలిగొంది. బుధవారం భీమదేవరపల్లి మండలం గాంధీనగర్‌కు చెందిన మండ ప్రణయ్(21) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ప్రణయ్ మండలంలోని వల్భాపూర్‌లో గల ఎస్సార్ఆర్ ఫార్మసీ కళాశాలలో థర్డ్ ఇయర్ చదువుతున్నాడు. సెకండియర్ చదివే తన స్నేహితుడు కోట మహేందర్‌రెడ్డితో కలిసి హనుమకొండలోని ఎస్‌వీఎస్ కళాశాలలో పరీక్ష రాసి తిరిగి మాణిక్యాపూర్‌కు బైక్‌పై బయల్దేరాడు. మార్గ మధ్యలోని హనుమకొండ-కరీంనగర్ ప్రధాన రహదారి ఎల్కతుర్తి శివారులో లారీ వీరి బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన ప్రణయ్ అక్కడికక్కడే మృతి చెందగా.. వెనకాలే కూర్చున్న మహేందర్‌రెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. మృతదేహాన్ని హుజూరాబాద్ మార్చురీకి తరలించినట్లు ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు. కాగా ప్రణయ్ హెల్మెట్ పెట్టుకుంటే బతికేవాడని స్థానికులు తెలిపారు.

స్పార్కిల్స్ వెలుగులు.. సమ్మర్ క్యాంప్‌లు

- ఆహ్లాదభరితంగా కార్యక్రమాలు
- పోస్టర్ ఆవిష్కరించిన పీఓ అంకిత్
- 22 నుంచి ప్రత్యేక శిక్షణ



స్పార్కిల్స్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐటీడీఏ పీఓ అంకిత్, తదితరులు

ఏటూరునాగారం: పుస్తకాల పురుగుల్లా ఏడాదంతా గడిపిన విద్యార్థులకు ఆహ్లాదాన్ని పంచాలని గురుకులం సొసైటీ భావిస్తోంది. వారిలో ఉన్న నైపుణ్యాల్ని వెలికి తీసేందుకు నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. ఆటపాటలతో పదిహేను రోజుల పాటు గడిపేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా స్పార్కిల్స్ పేరిట కార్యక్రమం చేపట్టబోతుంది. ఈనెల 22 నుంచి మే 6 వరకు ఐదు కేంద్రాల్లో సుమారు వెయ్యి మందికి ఈ ప్రత్యేక శిక్షణ చేపట్టనుంది. అందుకోసం ఇప్పటికే ఏర్పాట్లు మొదలుపెట్టారు గురుకులాల నిర్వాహకులు. వరంగల్, కరీంనగర్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల రీజియన్ల పరిధి గురుకులాల్లో సమ్మర్ క్యాంప్‌లను స్పార్కిల్స్ పేరుతో నిర్వహించనుంది. ఈకేంద్రాల్లో సోషల్ వెల్ఫేర్, ఏకలవ్య, మోడల్ స్కూల్, ట్రైబల్ వెల్ఫేర్ గురుకులాల్లోని 6 నుంచి 10వ తరగతి విద్యార్థులను ఎంపిక చేసి బాలురు, బాలికలకు వేర్వేరు క్యాంపులను ఏర్పాటు చేసి కార్యక్రమాలు చేపట్టనుంది. ములుగు జిల్లాలో ఏటూరునాగారం (బాలుర), జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కాటారం(బాలికలు), ములుగు(బాలురు), వరంగల్, కరీంనగర్ రీజియన్ పరిధిలోని అశోక్‌నగర్ సైనిక్ స్కూల్‌లో (బాలుర), సిరిసిల్లలోని గురుకులంలో (బాలికలు)ల క్యాంప్‌లను ఏర్పాటు చేసి ఒక్కో క్యాంప్‌లో 200ల మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తుంది. సుమారుగా ఐదు క్యాంప్‌లలో వెయ్యి మంది విద్యార్థులకు 15 రోజుల పాటు లైవ్ స్కిల్స్, వెస్ట్రన్ డ్యాన్స్‌లు, సీపీఎస్ ప్రోగ్రాం, ఆర్ట్ డ్రాయింగ్ ఉంటాయి. డెయిలీ క్లాస్‌లు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. ఫైర్ క్యాంప్‌లు, డ్యాన్స్‌లు, పాటలు పాడడం చేయిస్తారు. విద్యార్థులకు వేసవిలో ఆటవిడుపు, నైపుణ్యాల పెంపునకు నిపుణులు శిక్షణ ఇవ్వనున్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

స్పార్కిల్స్(సమ్మర్ క్యాంప్)లను విజయవంతం చేయాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో నాలుగు క్యాంప్‌లు, సిరిసిల్లలో ఒక క్యాంప్ ఏర్పాటు చేయడం జరుగుతుందని పీఓ వెల్లడించారు. ఈసందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో స్పార్కిల్స్ (సమ్మర్ క్యాంప్) పోస్టర్‌ను పీఓ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వేసవి శిబిరాలు విద్యార్థులకు కొత్త నైపుణ్యాలను అన్వేషించడానికి, నేర్చుకోవడానికి ఒక వేదికను అందిస్తాయన్నారు. సొసైటీ సూచనలను పాటిస్తూ తమ వంతుగా కృషి చేసి ఈ శిబిరాన్ని విజయవంతం చేయాలని పీఓ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్‌సీఓలు డీఎస్ వెంకన్న, రాజ్యలక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరాజు, సంగీత్‌సాగర్ పాల్గొన్నారు.

కంపెనీలో పనికి తరలిస్తున్న 30 మంది బాలల పట్టివేత

కాజీపేట రూరల్: దర్భాంగా– సికింద్రాబాద్ వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లో బుధవారం రాత్రి రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులు బాలలను పనుల కోసం తరలిస్తున్నారనే సమాచారంతో ట్రైన్‌లో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ డ్రైవ్‌లో సుమారు 30 మంది బాలల్ని అదుపులోకి తీసుకున్నారు. రాత్రి 10 గంటలకు కాజీపేట జంక్షన్‌కు ట్రైన్ రాగా.. బాలలను దింపివేసినట్లు ఆర్పీఎఫ్ సీఐ సంజీవరావు తెలిపారు. 18 ఏళ్లలోపు బీహార్‌కు చెందిన బాలలను బ్రోకర్స్ హైదరాబాద్ నగరంలో వివిధ ప్రైవేట్ కంపెనీల్లో పని చేయించేందుకు తరలిస్తున్నారని తెలిపారు. కాజీపేటలో అదుపులోకి తీసుకున్న బాలలను జీఆర్పీ పోలీసులకు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి మృతి

ఉమ్మడి వరంగల్ జిల్లాలో బుధవారం రోడ్డు, రైలు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా.. ఒక చిన్నారి చికిత్స పొందుతూ మృతి చెందింది.

రైలు ఢీకొని మహిళ మృతి..



గుర్తు తెలియని మహిళ మృతదేహం

నెక్కొండ: నెక్కొండ రైల్వే స్టేషన్ పరిధిలో రైల్వే ట్రాక్ దాటుతున్న క్రమంలో ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో గుర్తు తెలియని మహిళ(50) మంగళవారం రాత్రి 10 గంటలకు ట్రాక్ దాటుతోంది. ఈక్రమంలో లక్నో ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదవశాత్తు ఆమెను ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రగాయాలపాలై రక్తస్రావంతో మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు శవ పంచనామా నిర్వహించారు. మహిళ మృతదేహంపై గ్రీన్ అండ్ ఆరెంజ్ చుక్కల చీర, గ్రీన్ కలరు జాకెట్ ఉన్నట్లు ఆయన తెలిపారు. ఘటనాస్థలిలో ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాన్ని ఎంజీఎం ఆస్పత్రిలో భద్రపర్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఆచూకీ కోసం 9701747014, 94406 27532లో సంప్రదించాలని ఆయన సూచించారు.

బస్సు ఢీకొని యువకుడు..

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలం మంజూర్‌నగర్ 8వ ఇంక్లైన్ క్రాస్ వద్ద బుధవారం బస్సు ఢీకొని మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన గట్టు రఘు(30) అక్కడికక్కడే మృతి చెందాడు. రఘు బైక్‌పై భూపాలపల్లికి వచ్చి తిరిగి పెద్దాపూర్‌కు వెళ్తుండగా.. కేటీకే ఎనిమిదో ఇంక్లైన్ క్రాస్ రోడ్డు వద్ద వెనుక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు రఘు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో అతడి తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య స్నేహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రాంనర్సింహారెడ్డి తెలిపారు.



ఘటనాస్థలిలో రఘు మృతదేహం

చికిత్స పొందుతున్న చిన్నారి..



నందిని(ఫైల్)

పాలకుర్తి టౌన్: ఈనెల 6న ఇద్దరు కూతుళ్లకు కూల్‌డ్రింక్‌లో క్రిమి సంహారక మందు కలిపి ఓ తండ్రి తాగించాడు. ఈఘటనలో ఒక కుమార్తె అదే రోజు మృతి చెందగా.. చికిత్స పొందుతూ బుధవారం మరో కుమార్తె నందిని(6) మృతి చెందింది. జనగామ జిల్లా పాలకుర్తి మండలం గూడూరు శివారు జానకీపురానికి చెందిన గుండె శ్రీనుకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు. ఈనెల 10న ఇద్దరు కూతుళ్లకు కూల్‌డ్రింక్‌లో క్రిమిసంహారక మందు కలిపి శ్రీను తాగించాడు. చికెన్‌తో భోజనం పెట్టాడు. వీళ్లిద్దరూ అస్వస్థతకు గురవగా.. ఎంజీఎంకు తరలించి చికిత్స అందించారు. పెద్ద కూతురు నాగప్రియ అదే రోజు మృతి చెందగా.. నందిని పరిస్థితి విషమంగా ఉండడంతో.. పోలీసుల సాయంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లి చికిత్స అందించారు. తొమ్మిది రోజుల అనంతరం బుధవారం నందిని మృతి చెందింది. ఇద్దరు కూతుళ్ల చావుకు కారమణమైన శ్రీనును పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించారు.

బాలుడి ప్రాణం తీసిన నీటితొట్టె

గూడూరు: నీటి తొట్టిలో పడి మండలంలోని జంగుతండా శివారు ఆగబోయిన రాములు తండాకు చెందిన ఈసం వీరస్వామి, వినీత దంపతుల ఏడాదిన్నర కుమారుడు వియాన్‌సింగ్ పటేల్ బుధవారం మృతి చెందాడు. వియాన్ ఇంటి ఎదుట ఆడుకుంటుండగా.. తల్లిదండ్రులు పనిలో నిమగ్నమయ్యారు. కొద్దిసేపటికి తల్లిదండ్రులు కుమారుడి కోసం వెతకగా.. ఎంతకూ కనిపించలేదు. చుట్టూ వెతకగా.. నీటి తొట్టిలో శవమై కనిపించాడు. కొడుకును చూసిన తల్లిదండ్రులిద్దరూ బోరున విలపించారు. వారిని ఆక్రందనలు చూసిన స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు.



వియాన్‌సింగ్ పటేల్(ఫైల్)

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

JAI BHARATH STUDY HALL
■ జై భారత్ స్టడీ హాల్ కాజీపేటలో ప్రారంభం పోటీ పరీక్షలు & అనేక రకాల ప్రవేశ పరీక్షల కోసం ప్రిపేర్ అయ్యే విద్యార్థులు ఉద్యోగ అభ్యర్థుల కోసం సంప్ర॥ HP పెట్రోల్ పంప్ ప్రక్కన, బాపూజీనగర్, కాజీపేట. 8690869052 [W-785488]

REAL ESTATE

FLATS FOR SALE
■ KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్డుకి, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంటులో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26935]

HOUSE FOR SALE
■ ఉర్సుగుట్ట నుండి ఖాజీపేట్ వెళ్ళు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన, భట్టుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26936]
■ వరంగల్, రంగశాయిపేట, శేషాద్రిహిల్స్‌లో E/F తో గల డీలక్స్ Ready to Occupy 2 BHK House అమ్మకానికి కలదు. సెల్: 7660008666, 8309035091. [WA-26937]
■ ములుగురోడ్డు కాకతీయ కెనాల్ కన్నేమూల గణపతి టెంపుల్‌కి దగ్గరలో G+1 తో గల Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26938]

WANTED
■ Wanted Female telecallers for Leading a Banking Channel Salary 10K. Q: Any Degree, Direct Job Not a Consultant No Fee. Cont: 7396195324. [WA-5364]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

■ TSRTC WGL-1 డిపో యందు అవుట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేయుటకు బస్ వాషింగ్ & క్లీనింగ్ & Parking డ్రైవర్స్, వాటర్ కాటన్స్ లోడింగ్ కొరకు కావలెను. Age: 18-55, Cont: 9640721125. [W-785489]
■ గుమాస్తాలు 5 గురు కావలెను జీతం: 9000/- పద్మావతి ఫర్నీచర్ అండర్ బ్రిడ్జి రోడ్, శివనగర్, వరంగల్ లోకల్ వారికి ప్రాధాన్యత సంప్రదించండి డైరెక్ట్‌గా షాప్ దగ్గరికి. [W-785484]
■ ఇంటి దగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిట్ చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15,000-20,000 వరకు జీతం మరిన్ని వివరాలకై. 9000408325 [G-785738]
■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారాని 83500/- సంపాదించుకోండి. వాట్సాప్ కాల్ చేయండి. 9573633520, 9059633520 [M-1190672]
■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రసులు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-785739]
■ హన్మకొండ, వరంగల్ సిటిలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ (M/F) & సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. జీతం: 12000-15000/- సంప్ర॥ 8688072125 [W-785490]
■ హాలీక్రిష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ: 16K-18K, ఏజెంట్ కమిషన్ 6K. ఫోన్.9640528899. [H-793415]

PASSPORT MISSING
■ Putta Sukumar Reddy, S/o. P. Kishan Reddy, H.No. 4-80, Krishnajigudem, Chilpur (M), Jangaon Dist - 506301, Lost my original Passport No.E0519282 while Travelling from Krishnagiduem to Chinnapendiyal in my own 2 wheeler, if found to Cont: 7386998997. [W-1002182]

WANTED TEACHERS
■ Wanted Primary teachers to teach all subjects, walk in 9am - 12pm. WKPS, postal Colony, HNK. Cell: 8500596555, 9652529521. [WA-6953]
■ Experienced Teachers to Teach 6th to Inter and EAMCET. Maths, Physical Science, Biology, Oxford Tutorials & Spoken English. Cont: 6301134687. [W-785517]
■ Wine Shop లో పనిచేయుటకు వర్కర్స్ కావలెను. హసన్‌పర్తి మరియు కమలాపూర్ సంప్రదించండి. సెల్: 9182922080. [WA-13017]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ 9010144453
వరంగల్ 9705748198
నర్సంపేట 9010144453
జనగామ 9951602871
మహబూబాబాద్ 9010144453
జయశంకర్ భూపాలపల్లి 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సింగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వారా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.